


**(1)**

ఇంతంత దీపమ్ము ఇల్లల్ల వెలుగు,
ఈశ్వరుడి చందమామ జగతంత వెలుగు,
గోరంత దీపమ్ము కొండల్ల వెలుగు,
గోపాలకృష్ణమ్మ మందల్లో వెలుగు,
చిన్నంత దీపమ్ము మేడలకు వెలుగు
మహారాజు మా అబ్బాయి మా కళ్ళ వెలుగు.

**(2)**

సూర్యచంద్రులు అన్నదమ్ములు,
జోడుగుఱ్ఱాలెక్కి జూదమాడేరు,
అబ్బాయి తమ్ముడు అన్నదమ్ముల్లు,
ఇంటి వాసాలెక్కి లెక్క రాసేరు.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

(3)

చిక్కుడూ పువ్వెరుపు చిలుక ముక్కెరుపు,
చిగురెరుపు చింతల్లు దోరపండెరుపు,
రక్కసపండెరుపు రాగిచెంబెరుపు,
రాజుగారింట్లోని మాణిక్యమెరుపు,
తానెరుపు అమ్మాయి తనవారిలోన.

(4)

ఉయ్యాలలో పిల్ల ఉగ్గకేడిస్తే,
ఉత్తమ్మ యశోద ఊచి ఒగ్గ పొయ్యి,
పల్లకీలో పాప పాలకేడుస్తే,
బలభద్ర మాలక్ష్మి పాడి పాలు పొయ్యి,
ఏటికి కాలువ ఎంత దూరము,
యెత్తిపెంచిన తల్లి కంత మోహము,
కాలువనీళ్ళన్ని కడుసముద్రమాయె,
కడలేని మోహమే కన్నతల్లికి.

(5)

చిక్కుడాకూ మీద చిలక వాలింది,
చిలకెక్కి ఓ రాణి చిక్కి ఉన్నాది,
అరిటాకు మీద హంస వాలింది,
హంసెక్కి ఓ రాణి అమరి ఉన్నాది,
కొబ్బరాకు మీద కోకిల వాలింది,
కోకిలెక్కి ఓ రాణి కోరి ఉన్నాది,
మామిడాకు మీద మంచు వాలింది,
మంచెక్కి ఓ రాణి పొంచి ఉన్నాది,



PDF created with pdfFactory trial version www.pdffactory.com

గుమ్మడాకు మీద గువ్వ వాలింది ,
గువ్వెక్కి ఓ రాణి గూడొగ్గినాది ,
చిక్కుడాకు మీద చిలక అబ్బాయి ,
చిలకెక్కి అమ్మాయి చిక్కి ఉన్నాది,
అరిటాకు మీద హంస అబ్బాయి ,
హంసనెక్కి అమ్మాయి అమరి ఉన్నాది ,
కొబ్బరాకు మీద కోకిల అబ్బాయి ,
కోకిలెక్కి అమ్మాయి కోరి ఉన్నాది,
మామిడాకు మీద మంచు అబ్బాయి ,
మంచు ఎక్కి అమ్మాయి పొంచి ఉన్నాది,
గుమ్మడాకు మీద గువ్వ అబ్బాయి ,
గువ్వెక్కి అమ్మాయి గూడొగ్గినాది.

## (6)

చింతచెట్టు కింద చిట్టిబొమ్మరిళ్ళు ,
వాటికి వాకిళ్ళు గోడు తలుపుల్లు ,
గోడుతలుపుల్ల కింద పొందైన మేడ,
మేడనున్నాయి రెండు హంసల్లు ,
మేడనున్నాయి రెండు హంసల్లు ,
రాచిలక అబ్బాయి రంభ అమ్మాయి ,
రాచిలక అబ్బాయి రంభ అమ్మాయి ,
చిలుకలకు చెలికాడు తాను అబ్బాయి ,
చిలుకలకు చెలికాడు తాను అబ్బాయి ,
హంసలకు చెలికత్తె తాను అమ్మాయి.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

**(7)**

దంపు దంపన గానె - దంపెంతసేపు
ధాన్యరాశుల మీద చేయివేసినట్టు
వంట వంటన గానె - వంటెంతసేపు
వదిన మరదళ్ళు - వాదించినట్టు
పిడికెడు పిత్తనాలు - మడికెల్లె జాలు
ఒక్కడే కొడుకయిన వంశాన జాలు.

**(8)**

రోకలెత్తాలేను , రోలెత్తలేను,
చామంతి కడియాల చేయెత్తలేను ,
రోలుకు పోటాశ, పొరుగు నాకాశ,
కంటికి రెప్పాశ, శ్రీ వేంకటేశ.

**(9)**

రోకలి చిన్నది
రోలు చిన్నది
నాతో దంచేటి
చెలియ చిన్నది
నా చేతి రోకలి
నల్ల రోకలి
నా తోడబుట్టిన వాళ్ళు
రామలక్ష్మణులు
కూడు పెట్టేటి రోకలికీ
రెండు దండాలు
మముగన్న తల్లికీ
వేయిదండాలు.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## (10)

సుబ్బీ గొబ్బెమ్మ
చామంతి పువ్వంటి
చెల్లెల్ని ఇయ్యవే
తామర పువ్వంటి
తమ్ముణ్ణి ఇయ్యవే
మల్లె పువ్వంటి
మొగుణ్ణి ఇయ్యవే

## (11)

అదిగో బూచాడు
అటక మీద ఉన్నాడు
ఏడుస్తే వస్తాడు
నిన్ను ఎత్తుకు పోతాడు
మిడి గుడ్లవాడు
మేకంత ఉంటాడు
ఏడుస్తే వస్తాడు
నిన్ను ఎత్తుకు పోతాడు.

## (12)

పిట్ట దంచింది
పిడికెడు బియ్యంబు
కాకి దంచింది
కడివెడు బియ్యంబు
దంచింది మా అమ్మాయి
బస్తాల బియ్యంబు.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

**(13)**

నిదురపో చెల్లెమ్మ
నిదురపో బుజ్జమ్మ
నిద్రకన్నెకలొచ్చి
నిన్ను లేపేరు
నిద్రకూ వెయ్యేళ్ళు
నీకు వెయ్యేళ్ళు
నినుగన్న తల్లికీ
నిండు నూరేళ్ళు

**(14)**

ఓ పిల్లా - ఓ పిల్లా
పిల్లా నీవు
గోంగూర కోయగలవా
పిల్లా నీవు !
  గోంగూర కోయలేను
  మామా నేను
  గోళ్ళన్నీ కందుతాయి
  మామా నాకు !!

ధాన్యమును దంచగలవా
పిల్లా నీవు
  ధాన్యం దంచలేను
  మామా నేను
  ధాన్యమంటే దగ్గు
  మామా నాకు!



PDF created with pdfFactory trial version www.pdffactory.com

చాప అయినా వెయ్యగలవా
పిల్లా నీవు
    చాప అయినా వెయ్యలేను
    మామా నేను
    చీదరింపుకొస్తాది
    మామా నాకు!

సంతకయినా వెళ్ళగలవా
పిల్లా నీవు
    సంతకయిన వెళ్ళలేను
    మామా నేను
    సందడి అంటే పడదు
    మామా నాకు!

Key words: Janapada, sahiti, sahityam, palle paatalu

www.maganti.org Vamsi M Maganti contact@maganti.org



PDF created with pdfFactory trial version www.pdffactory.com